కూల్చిందెవరు?

● ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే దుకాణాల కూల్చివేత

● గుర్తుతెలియని వ్యక్తి కూల్చివేశాడంటున్న అధికారులు
● ఓ బడా బాబు కోసమే ఈ నాటకాలంటున్న బాధితులు

ఎర్రగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే అధికారులు తమ షాపులను కూల్చివేశారని బాధితులు బోరున విలపిస్తున్నారు. తమ జీవనోపాధిని దెబ్బ తీసి రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రగడ్డ జాతీయ రహదారిలో 70 ఏళ్లుగా దుకాణాలు నడుపుకుంటున్నామని, మంగళవారం హటాహుటిన జేసీబీతో వచ్చి మూడు షాపులను కూల్చివేశారన్నారు. 2009లో రోడ్డు విస్తరణకు ముందు తమ దుకాణాలు వంద గజాల విస్తీర్ణంలో ఉండేవని.. అయితే రోడ్డును విస్తరించినప్పుడు తాము 87 గజాలు కోల్పోయామన్నారు. కోర్టు ఆర్డర్ ద్వారా మిగతా 13 గజాలలో చిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నామని బాధితులు తెలిపారు.


దుకాణాలను కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)


పూర్తిగా నేలమట్టమైన దుకాణాలు

బడా బాబు నిర్మాణం కోసమే..?

తమ దుకాణాల వెనుక ఉన్న బడా బాబు భవన నిర్మాణం కోసమే తమ దుకాణాలను కూల్చివేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఆయనతో కుమ్మక్కు అయ్యారని మండిపడ్డారు. ఆ సమయంలో అక్రమ నిర్మాణాలను, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడానికి వచ్చామని అధికారులు పేర్కొన్నారని.. అయితే తాము ఉన్నతాధికారులతో మాట్లాడుతుండగానే గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ వేసుకొని వచ్చి జేసీబీతో తమ దుకాణాలను కూల్చివేశారని అధికారులు చెబుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ప్రమేయం లేకుండా కూల్చివేతలు ఎలా జరుగుతాయని వారు ప్రశ్నించారు.

ఆసరా లేకుండా చేశారు



తమ దుకాణాల వెనుక ఉన్న బడా బాబు భవన నిర్మాణం కోసం తమను రోడ్డున పడేశారు. మా వద్ద కోర్టు జారీ చేసిన పత్రాలు సైతం ఉన్నాయి. గతంలో రోడ్డు విస్తరణలో కోల్పోయిన స్థలానికి మినహా ఉన్న 13 గజాలలో వ్యాపారం చేసుకుని జీవిస్తున్నాం. ఇప్పుడు అది కూడా లేకుండా చేశారు.

- గోగీఖర్ బాలరాజ్, బాధితుడు

డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం



ఎంత చెప్పినా వినకుండా షాపులను కూల్చివేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తుతెలియని వ్యక్తి ఇలా చేశాడంటూ బూటకపు మాటలు చెబుతున్నారు. అంతా వారి కనుసన్నల్లోనే జరిగింది. ఈ విషయమై మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- బ్రిడ్జ్ మోహన్ అగర్వాల్, బాధితుడు

తిరిగి నిర్మించాలి



కోర్టు ఆర్డర్ ప్రకారం 13 గజాల్లో వ్యాపారం చేసుకుంటునాం. అన్యాయంగా మా దుకాణాలను కూల్చివేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో మొరపెట్టుకున్నా వినలేదు. అధికారులు మా దుకాణాలను ఎలా కూల్చారో అలాగే నిర్మించి ఇవ్వాలి. లేదంటే డీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం.

- శ్రీనివాస్, బాధితుడు


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కళాశాలలో సినిమా షూటింగ్‌పై ఆందోళన

ఎర్రగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ ఆయుర్వేద కళాశాలలో సినిమా షూటింగ్‌కు అనుమతి ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. షూటింగ్‌లతో తమ చదువులపై ప్రతికూల పడుతుందన్నారు. గురువారం నుంచి కళాశాలలో షూటింగ్ జరుగుతున్నప్పటికీ ఫిర్యాదు చేయడానికి యాజమాన్యం అందుబాటులో లేదన్నారు. ఈ విషయమై షూటింగ్ నిర్వాహకులను వివరణ కోరగా ఆయుష్ విభాగం ఉన్నతాధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ అనుమతితోనే షూటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం హాలిడే కావడంతో విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం కలగలేదన్నారు.


సాయిని సన్మానిస్తున్న వయోధికులు

ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడికి సన్మానం

అమీర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 80 ఏళ్ల పైబడినా సామాజిక బాధ్యతల నిర్వహణలో ఎంతో ఉత్సాహంగా ముందడుగు వేస్తున్న జీహెచ్‌ఎంసీ ఆసరా కమిటీ ఖైరతాబాద్ ఉపాధ్యక్షుడు జేఎస్టీ సాయి అభినందనీయుడని ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని ముక్తినూతలపాడు వయోధికులు అన్నారు. సనత్‌నగర్ డివిజన్ మోడల్‌కాలనీ కమ్యూనిటీహాల్ సంస్కృతిలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వయోభారం శరీరానికే తప్ప మనసుకు కాదంటూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న సాయిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వయోధికులు వాసు, రామచంద్రరావు, రామకృష్ణ, ఉమామహేశ్వర ప్రసాద్, భుజంగరావు, మారుతి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో నేటి నుంచి మండల పూజలు

బంజారాహిల్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శబరిమల తరహాలో ఉత్సవాలను నిర్వహిస్తున్న శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయం 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. మండల కాలంలో ప్రతిరోజూ విశేష పూజలతో పాటు అష్టకళశాభిషేకం, లక్ష పుష్పార్చన, గజారోహణం, గణపతి హోమం, అభిషేకం, సాయంత్రం పడిపూజ వంటి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఈ ఏడాదికి సంబంధించి అయ్యప్ప ఆలయంలో 16 నుంచి మండల పూజలు మొదలు కానున్నాయి. ఇందులో భాగంగా నేటి నుంచి 41 రోజుల పాటు అయ్యప్ప పడిపూజ మహోత్సవం నిర్వహిస్తారు. డిసెంబరు 8న అష్టకళశాభిషేకం, 15న గజారోహణం, 17న మహాపూర్ణాహుతి, లక్షపుష్పార్చన చేస్తారు. అయ్యప్ప మాలధారులతో పాటు సాధారణ భక్తులకు ఇక్కడ నిత్యం అన్నదానం, సాయంత్రం అల్పాహారం అందిస్తారు.

సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన

● బీజేపీ నేత శ్రీనివాసరావు

బంజారాహిల్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో ఖైరతాబాద్ నియోజకవర్గంలో అనూహ్య స్పందన వచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేచినేని శ్రీనివాసరావు అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లోని కార్యశాల సాగర్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో సభ్యత్వ నమోదు సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోనే అత్యధికంగా జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో కొత్తగా బూత్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, కో కన్వీనర్ బలిజ రమేష్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా లీగల్ సెల్ కో కన్వీనర్ కస్తూరి మహిపాల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేచినేని శ్రీనివాసరావు


విజేతలతో సంఘసేవకుడు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, కోచ్ అనిల్ తయ్యప్ప తదితరులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎర్రగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సంఘ సేవకుడు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రన్నింగ్ పోటీల్లో విజేతలకు శుక్రవారం ఎర్రగడ్డలోని జీటీఎస్ గ్రౌండ్స్‌లో మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడా రంగాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎర్రగడ్డ చుట్టుపక్కల ప్రాంతాల్లోని పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు కోచ్ అనిల్ తయ్యప్ప పలు క్రీడా విభాగాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని.. ఆయన వద్ద శిక్షణ తీసుకున్న వారు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో విజేతలుగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు శిక్షణ తీసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా చిల్డ్రన్స్ డే సెలబ్రేషన్స్

బంజారాహిల్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ కల్చరల్ కేంద్రంలో చిల్డ్రన్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు, అతిథులుగా సినీ నటులు తరుణ్, నిత్య శెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ.. చిన్నారులు క్రీడలను, చదువును ఒకే దృక్పథంతో చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ సాయిరాజ్ ఆధ్వర్యంలో చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎన్‌సీసీ ప్రెసిడెంట్ కె.ఎస్.రామారావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎన్.రెడ్డి, సెక్రటరీ తుమ్మల రంగారావు, జాయింట్ సెక్రటరీ కె.సదాశివ రెడ్డి, కమిటీ మెంబర్స్ కాజా సూర్యనారాయణ, ఎస్.భాస్కర్ నాయుడు, ఏడిద రాజా, జె.బాలరాజు తదితరులు పాల్గొన్నారు. పలు విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

నకిలీ మెసేజ్‌తో రూ.38 వేలు లూటీ

బంజారాహిల్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అప్పు తిరిగి చెల్లిస్తున్నట్టు నకిలీ మెసేజ్ పంపించిన సైబర్ నేరగాడు రూ.38 వేలు కాజేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1కి చెందిన స్వగత రాయ్‌కు ఈ నెల 12న ఓ వ్యక్తి ఫోన్ చేసి ఆమె తండ్రికి రూ.30 వేలు ఇవ్వాలని, గూగుల్ పే ద్వారా చెల్లిస్తున్నట్టు చెప్పాడు. కాసేపటి తర్వాత పలు దఫాలుగా 68 వేల రూపాయలు జమ అయినట్టు మెజేస్‌లు వచ్చాయి. వెంటనే నేరగాడు ఫోన్ చేసి ఎక్కువ డబ్బు చెల్లించామని చెప్పి రూ38 వేలను తమ ఖాతాలో జమ చేయించుకున్నాడు. తర్వాత ఆమె తన బ్యాంకు ఖాతా పరిశీలించగా డబ్బు రాలేదని తేలింది. దీంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న విజయారెడ్డి

మహారాష్ట్రలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

● విజయారెడ్డి

ఖైరతాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో మహారాష్ట్రలో పార్టీ విజయం సాధిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. మహారాష్ట్రలో ఆమె తన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నానా బహు పటోలేతో కలిసి టేడా నియోజకవర్గంలో జరిగిన సభలో ఆమె పాల్గొన్నారు.

కోట నీలిమ ఇంట్లో విషాదం


అన్నపూర్ణ (ఫైల్)

అమీర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. కొంత కాలంగా అనారోగ్యంలో బాధపడుతున్న నీలిమ అమ్మమ్మ అన్నపూర్ణ మృతి చెందారు. మహారాష్ట్ర ఎన్నిల ప్రచారంలో ఉన్న నీలిమ హైదరాబాద్ చేరుకుని శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియలకు హాజరయ్యారు. అనంతరం తిరిగి మహారాష్ట్ర వెళ్లారు.

తాజ్‌కృష్ణలో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం

బంజారాహిల్స్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ తాజ్‌కృష్ణలో ఏర్పాటు చేసిన ఆధునిక సంప్రదాయ మేళవింపు కలగలిపిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ప్రదర్శనను శుక్రవారం వారాహి సిల్క్స్ ఎండీ డాక్టర్ స్పందన మద్దుల, టాలీవుడ్ నటి, బిగ్ బాస్ ఫేమ్ హిమజ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దేశంలోని అనేక నగరాల మహిళా వ్యాపారవేత్తలు, డిజైనర్లు ఒకే వేదికపై విభిన్నమైన వస్త్ర, లైఫ్ స్టైల్ ఉత్పత్తులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సూత్ర నిర్వాహకులు ఉమేష్ మాట్లాడుతూ.. వెడ్డింగ్ సీజన్‌లో కొత్త అనుభూతి ఇచ్చేలా షాపింగ్ ప్రియుల కోసం ప్రత్యేకమైన ఫ్యాషన్, భారతీయ దుస్తులు, డిజైనర్, వెస్టర్న్ వేర్, ఇండియన్ అప్పారెల్, హ్యాండ్లూమ్స్, కాస్ట్యూమ్-డిజైనర్ జ్యువెలరీతో పాటు గృహోపకరణాలు, పాదరక్షలు వంటి తదితర 50 వేల రకాల ఉత్పత్తులను 70 స్టాల్స్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 17 వరకు కొనసాగుతుందన్నారు.


ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న నటి హిమజ, వారాహి సిల్క్స్ ఎండీ డాక్టర్ స్పందన మద్దుల

ఈ కార్యక్రమంలో నగర సోషలైట్స్‌తో పాటు వర్ధమాన నటులు శశికళ టికూ, మహి తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న సందర్శకులు

ఆకట్టుకుంటున్న పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 1లో గల లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో కొలువుదీరిన డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శనను ఆకట్టుకుంటుంది. వెడ్డింగ్ ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా ఏర్పాటైన ప్రదర్శనలో రాజ్‌కోట, పటోలా దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగిల్ పటోలా దుపట్టా, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి 10 వేల రకాల ఉత్పత్తులు ఒకే వేదికలో మగువల మనసును దోచేస్తున్నాయి. "విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు ముఖ్యంగా పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను నేరుగా వీవర్ నుంచి వినియోగదారునికి అందించేందుకు నగరంలో ఏర్పాటు చేశామని, ఈ నెల 16 వరకు ప్రదర్శన కొనసాగుతుందని డి సన్స్ పటోలా ఆర్ట్ నిర్వాహకులు భవిన్ మక్వానా తెలిపారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఎగ్జిబిషన్ ప్రధాన లక్ష్యమని వివరించారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

బంజారాహిల్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1, 14లో హనుమాన్, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని కల్యాణమండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హేమావతి నగర్‌లోని శివాలయంలో, ఎర్రగడ్డలోని శ్రీ విజయలక్ష్మి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో విజయలక్ష్మి దేవాలయం కమిటీ చైర్మన్ చింతల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎం.వి. రెడ్డి, మేనేజర్ మల్లేష్, అర్చకులు వంశీ, నరసింహ, హేమావతి నగర్ దేవాలయ సంక్షేమ సంఘం అధ్యక్షులు గూడూరి చెన్నారెడ్డి, సభ్యులు జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.


స్వీట్లు, పిండి వంటలతో అలంకరణలో బల్కంపేట ఎల్లమ్మతల్లి


ఖైరతాబాద్ మహంకాళి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


శివలింగం ఆకృతిలో వెలిగించిన దీపాలు


బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

అమీర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గురువారం విడుదల చేసిన గ్రూప్4 ఫలితాల్లో ఎస్‌ఆర్‌నగర్ గ్రంథాలయంలో ప్రిపేర్ అవుతున్న ఐదుగురు ఎంపికయ్యారు. వారిలో శేఖర్ చెంగల్ ఉస్మానియా యూనివర్శిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా, గడ్డం శివకుమార్ జూనియర్ ఆడిటర్‌గా, శివరామ్ వార్డు ఆఫీసర్‌గా సంగారెడ్డి, వంశీకృష్ణారెడ్డి వార్డు ఆఫీసర్‌గా సూర్యపేట, పృథ్వీరాజ్ వార్డు ఆఫీసర్ మహబూబాబాద్‌లో ఉద్యోగాలు సాధించారు. గ్రంథాలయ అధికారి హరిబాబు వీరిని సన్మానించారు.


ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించిన లైబ్రేరియన్


వెంకటగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న బీజేపీ నాయకుడు బడుగు సతీష్ తదితరులు

'కామిక్ కాన్ ఇండియా' వేడుకలు ప్రారంభం

మోతీనగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో మూడు రోజులపాటు జరగనున్న కామిక్ కాన్ ఇండియా వేడుకలు శుక్రవారం హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. పాశ్చాత్త సంస్కృతి, యానిమేషన్ గేమింగ్‌ను ఆస్వాదించే నగర ప్రజలు ఈ వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం మూడు విభాగాలుగా ఏర్పాటు చేసిన ఈ హైదరాబాద్ కామిక్ కాన్ 2024 వేడుకల్లో యానిమేషన్ గేమింగ్, పాప్ కల్చర్, నేషనల్ ట్రావెలింగ్ విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మారుతి సుజుకి, యమహా ఆటోమొబైల్ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో యానిమేషన్ వేషధారణలోని వ్యక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా కామిక్ కాన్ ఇండియా సహ వ్యవస్థాపకులు, ఎండీ అక్షిత్ రాది మాట్లాడుతూ.. ఈ ఈవెంట్స్‌ను మారుతి సుజుకి సమస్త ఏర్పాటు చేసిందన్నారు. ఈ వేడుకలు ఉపఖండంలోనే అతిపెద్దవని.. పాశ్చాత్య సంస్కృతిని ఇష్టపడే ప్రజలకు ఇది ఒక గొప్ప అనుభూతి అన్నారు.


విచిత్ర వేషధారణతో ఆకట్టుకుంటున్న యువత



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన అగ్నిప్రమాద బాధిత కుటుంబ సభ్యులు

అండగా ఉంటా: ఎమ్మెల్యే తలసాని

మారేడుపల్లి, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఉంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం రాత్రి మోండా మార్కెట్‌లోని ఓ పూజా సామగ్రి దుకాణంలో అగ్నిప్రమాదం జరగడంతో కాలిపోయింది. బాధిత షాపు యజమాని మల్లికార్జున్ కుటుంబ సభ్యులు శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. తమను ఆదుకోవాలని వేడుకున్నారు. వారికి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే వెంటనే సికింద్రాబాద్ ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం మంజూరు చేయించాలని సూచించారు. బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు సురేష్, వెంకట్ ఉన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం

మారేడుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం టీజీఎస్ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ నిర్వహిస్తున్న డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదు చేయాలని ఆర్ఎం ఖుస్రో షా ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఫోన్ నం. 9959900808ను సంప్రదించి ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీకి సూచనలు, సలహాలు కూడా ఇవ్వాలని ఆర్ఎం కోరారు.



ముత్యాలమ్మ గుడిలో పూజలు చేసిన ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

ముత్యాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బోయిన్‌పల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో మహా ద్వారాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మంగళవారం ప్రారంభి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్గయ్య ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బీజేపీ నాయకులు బానుక మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకు లు ముప్పిడి మధుకర్, బద్దం బల్వంత్ రెడ్డి, శరత్, మోని, సదానంద్, ముఖేష్ యాదవ్ పాల్గొన్నారు.



విజేతలతో సంఘసేవకుడు కల్లెం శ్రీనివాస్ రెడ్డి, కోచ్ అనిల్ తయ్యప్ప

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎర్రగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సంఘ సేవకుడు కల్లెం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రన్నింగ్ పోటీల్లో విజేతలకు శుక్రవారం ఎర్రగడ్డలోని జీటీఎస్ గ్రౌండ్స్‌లో మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడా రంగాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎర్రగడ్డ చుట్టుపక్కల ప్రాంతాల్లోని పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు కోచ్ అనిల్ తయ్యప్ప పలు క్రీడా విభాగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని.. ఆయన వద్ద శిక్షణ తీసుకున్న వారు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో విజేతలుగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు శిక్షణ తీసుకోవాలని ఆయన అన్నారు.

నకిలీ మెసేజ్‌తో రూ.38 వేలు లూటీ

బంజారాహిల్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అప్పు తిరిగి చెల్లిస్తున్నట్టు నకిలీ మెసేజ్ పంపించిన సైబర్ నేరగాడు రూ.38 వేలు కాజేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1కి చెందిన స్వగత రాయ్‌కు ఈ నెల 12న ఓ వ్యక్తి ఫోన్ చేసి ఆమె తండ్రికి రూ.30 వేలు ఇవ్వాలని, గూగుల్ పే ద్వారా చెల్లిస్తున్నట్టు చెప్పాడు. కాసేపటి తర్వాత పలు దఫాలుగా 68 వేల రూపాయలు జమ అయినట్టు మెజేస్‌లు వచ్చాయి. వెంటనే నేరగాడు ఫోన్ చేసి ఎక్కువ డబ్బు చెల్లించామని చెప్పి రూ38 వేలను తమ ఖాతాలో జమ చేయించుకున్నాడు. తర్వాత ఆమె తన బ్యాంకు ఖాతా పరిశీలించగా డబ్బు రాలేదని తేలింది. దీంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్ రాజు, ట్రాఫిక్ సీఐ వెంకటరాములు

ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో నడుచుకోవాలి

● ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

అడ్డగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. శుక్రవారం ఆయన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 10వ నెంబరు ప్లాట్‌ఫామ్ సమీపంలో ప్రీపెయిడ్ ఆటో డ్రైవర్లతో సమా శం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజు దాదాపు రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, ఆటోల కోసం వచ్చే ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడాలని, క్రమశిక్షణతో నడుచుకోవాలని అన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగించినా, అధిక ఛార్జీలు వసూలు చేసినట్టు ఫిర్యాదులు అందినా సంబంధిత డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. ప్రతి ఆటో డ్రైవర్ డ్రెస్ కోడ్ పాటించాలని, లైసెన్స్, వాహన పత్రాలు, గుర్తింపు కార్డులు వెంట ఉంచుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో 60 మంది ఆటో డ్రైవర్లతో పాటు గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట రాములు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఈ పార్కు గతి ఇంతేనా!

- ఆర్ఆర్‌సీ మైదానంలో పార్కు నిర్మాణానికి ఐదేళ్ల క్రితం ఎమ్మెల్యే శంకుస్థాపన
- స్థలం రైల్వేదంటూ అర్థాంతరంగా పనుల నిలిపివేత
- సమస్య పరిష్కారంపై జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం
- వృథాగా పడి ఉన్న పార్కు స్థలం



అర్థాంతరంగా ఆగిపోయిన పార్కు పనులు

అడ్డగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లోని ఆర్ఆర్‌సీ మైదానం (లోహియనగర్ ఏరియాబస్తీ)లో 2019 నవంబరులో రూ. 18 లక్షల నిధులతో పార్కు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పద్మారావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అయితే.. నెల రోజులకే (డిసెంబర్ 2019)లో అర్థంతరంగా పార్కు పనులు నిలిచిపోయాయి. పార్కు నిర్మిస్తున్న స్థలం రైల్వే శాఖది అని వదంతులు రావడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశాడు. రైల్వే స్థలమని తెలిసినప్పటికీ నిర్లక్ష్యంగా పార్కు పనులు మొదలు పెట్టిన అధికారులు ఆ తర్వాత అయినా సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పార్కు కోసం విడుదల చేసిన రూ. 19 లక్షలను దేనికి వినియోగించారనేది కూడా ఎవరికీ తెలియదు. ఐదేళ్లుగా ఈ స్థలం వృథాగానే పడి ఉంది. జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పటికి కూడా ఈ స్థలంపై స్పష్టత ఇవ్వడం లేదు. ఇది రైల్వే శాఖ స్థలం అయితే ఎమ్మెల్యే పద్మారావు చొరవ తీసుకుని రైల్వే అధికారులతో మాట్లాడి ఇక్కడ పార్కు ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. పార్కు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలో నివసించే వేలాది మంది సేద తీరేందుకు, వ్యాయామాలు, వాకింగ్ వంటివి చేసేందుకు అనువుగా ఉంటుందని అంటున్నారు.



పార్కు నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం (ఫైల్)



మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్ అభివృద్ధికి నిధులు..

మోదీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

● బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

సికింద్రాబాద్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం సేకరించిన రక్షణ శాఖ భూములకు బదులుగా కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన రూ. 303.62 కోట్లను సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించాలని నిర్ణయం తీసుకోవడానికి మోదీ సర్కారే కారణమని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ చెప్పారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి డైరీ ఫాం రోడ్డు వరకు, ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వరకు నిర్మిస్తున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రోడ్ల విస్తరణ చేపట్టాల్సి ఉందని, ఇందుకు అవసరమైన భూములను రక్షణ శాఖ ఇస్తున్నందున రూ. 303.62 కోట్లలను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఆయన చెప్పారు. ఈ మొత్తాన్ని కన్సాలిడేటెడ్ ఫండ్ ఇండియాకు చెల్లించే బదులు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు, డాక్టర్ లక్ష్మణ్, ఈటల రాజేందర్‌ల నేతృత్వంలో తాను కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానన్నారు. తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొన్న మోదీ ప్రభుత్వం 303.62 కోట్ల మొత్తాన్ని కంటోన్మెంట్‌లోని వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇచ్చిందని రామకృష్ణ వెల్లడించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ తరహా అనుమతి ఇచ్చిన ప్రధాని మోదీతో పాటు కిషన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, ఈటల రాజేందర్‌లకు కంటోన్మెంట్ ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

మారేడుపల్లి, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం పికెట్‌లోని భూలక్ష్మీదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఆవరణలోని పంచభూత భూమేశ్వర్ స్వామి శివ పంచాయతన ఆలయంలో పంచామృత అభిషేకం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల నుంచి సాంప్రదాయ దుస్తులు ధరించి విచ్చేసిన వందలాది మంది భ క్తులు శివలింగానికి పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రతినిధి జెట్టి ఉమేశ్వరరావు పర్యవేక్షణలో కార్తీక పౌర్ణమి జ్వాలాతో రణం, శివపార్వతి ఉత్సవాల ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు కృష్ణ అవధాని పాల్గొన్నారు.



లాలాపేట్‌లోని శివాంజనేయ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు మేల్లూరి అఖిల్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. -(తార్నాక, ఆంధ్రజ్యోతి)



పంచభూత భూమేశ్వర్ స్వామి శివపంచాయతన శివాలయంలో లింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని ఆనంద దత్తసాయి ఆలయంలో సహస్ర దీపాలంకరణ



భూలక్ష్మమ్మ ఆలయంలో..

తిరుమలగిరి నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం బొల్లారం డౌటన్ బజార్ లోని భూలక్ష్మమ్మ ఆలయంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.నరసింహన్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అరవిండ్‌ల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. జీవీ బాల్‌రాజ్, గాంధీ, సుమన్ కుమార్, విష్ణు, కిరణ్, సతీష్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



ఉజ్జయిని మహంకాళి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కిటకిటలాడిన ఉజ్జయిని మహంకాళి ఆలయం

సికింద్రాబాద్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సికింద్రాబాద్‌తో పాటు జంటనగరాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామి ఆలయం ఎదుట కార్తీక దీపాలు వెలిగించి, భక్తిప్రవృత్తులను చాటుకున్నారు. అనంతరం మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కాగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి రామేశ్వర్, మాజీ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



ఆలయంలో చండీ హోమం నిర్వహిసున్న వేదపండితులు



తార్నాకలోని తమ నివాసంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తున్న జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీక, చంద్రారెడ్డి దంపతులు - (తార్నాక, ఆంధ్రజ్యోతి)



సికింద్రాబాద్‌లో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



సికింద్రాబాద్ సుబ్రహ్మణ్య స్వామి గుడిలో కార్తీక పూజలు చేస్తున్న భక్తులు

సేవా నంది, సేవా భూషణ్ అవార్డులకు

దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సేవా నంది, సేవా భూషణ్ జాతీయస్థాయి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లోని కళాకారులు, రచయితలు, వైద్యులు, క్రీడాకారులు, కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు శుక్రవారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ది బెస్ట్ అకాడమీ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ స్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈ.ఎస్.ఎస్.నారాయణ మాష్టారు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ లోపు ఆల్ ది బెస్ట్ అకాడమి, డోర్ నంబర్ 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు తిరుమలగిరి, సికింద్రాబాద్, 15 చిరునామాకు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 9652347207 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

'కామిక్ కాన్ ఇండియా' వేడుకలు ప్రారంభం

మోతీనగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో మూడు రోజులపాటు జరగనున్న కామిక్ కాన్ ఇండియా వేడుకలు శుక్రవారం హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. పాశ్చాత్త సంస్కృతి, యానిమేషన్ గేమింగ్‌ను ఆస్వాదించే నగర ప్రజలు ఈ వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం మూడు విభాగాలుగా ఏర్పాటు చేసిన ఈ హైదరాబాద్ కామిక్ కాన్ 2024 వేడుకల్లో యానిమేషన్ గేమింగ్, పాప్ కల్చర్, నేషనల్ ట్రావెలింగ్ విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మారుతి సుజుకి, యమహా ఆటోమొబైల్ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో యానిమేషన్ వేషధారణలోని వ్యక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా కామిక్ కాన్ ఇండియా సహ వ్యవస్థాపకులు, ఎండీ అక్షిత్ రాది మాట్లాడుతూ.. ఈ ఈవెంట్స్‌ను మారుతి సుజుకి సమస్త ఏర్పాటు చేసిందన్నారు. ఈ వేడుకలు ఉపఖండంలోనే అతిపెద్దవని.. పాశ్చాత్య సంస్కృతిని ఇష్టపడే ప్రజలకు ఇది ఒక గొప్ప అనుభూతి అన్నారు.



వివిధ వేషధారణలో యువత

సెల్‌ఫోన్ల దొంగ అరెస్ట్

● అతడికి సహకరించిన బాలుడు కూడా

బర్కత్‌పుర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లు చోరీ చేస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం కాచిగూడ పీఎస్‌లో విలేకరులు సమావేశంలో ఏసీపీ రఘు వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన రాందాస్ కుమారుడు షెట్టి రాకేష్ (23) తుర్కయంజాల్ ఇంజాపూర్‌లోని నీలాద్రినగర్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకోసం డబ్బు సంపాదించడానికి దొంగతనాల బాటపట్టాడు. తన ఇంటి వద్ద ఉంటున్న మైనర్(బాలుడు)ను తీసుకొని ద్విచక్ర వాహనంపై రోడ్లపై తిరుగుతూ సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నాడు. ఇటీవల కాచిగూడలో జరిగిన చోరీపై ఎస్ఐ రవికుమార్ బృందం సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా రాకేష్ దొంగతనాలు బయటపడ్డాయి.

శుక్రవారం రాకేష్, అతడికి సహకరించిన బాలుడిని అరెస్ట్ చేసి, వారి నుంచి 4 సెల్‌ఫోన్‌లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మైనర్ బాలుడిని బాలుర సదన్‌కు తరలించామన్నారు.